

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించమని ఎస్పీ ఏఆర్ దామోదర్ సిబ్బందిని హెచ్చరించారు. సింగరాయకొండ, టంగుటూరు పోలీస్‌స్టేషన్లను పరిశీలించారు. - IIలో..



ఢిల్లీ ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు

ఢిల్లీలో వైఎస్ జగన్ చేపట్టిన ధర్నాకు జిల్లా నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
35/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో సమస్యలు నమోదు చేసుకోవచ్చు

ఒంగోలు అర్బన్: ప్రజలు వారి సమస్యలను ప్రతి రోజు సచివాలయాల్లో వారి విజ్ఞప్తులు అందజేయవచ్చని, అదేవిధంగా ప్రజలే స్వయంగా ఆన్‌లైన్‌లో కూడా సమస్యలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. http:/meekosam.ap.gov.in పోర్టల్‌లో ఆధార్ నంబర్ ద్వారా సమస్యలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో కలెక్టర్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

26న సాఫ్ట్‌బాల్ సీనియర్స్ జిల్లా జట్టు ఎంపిక

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ సీనియర్స్ జిల్లా జట్టు ఎంపిక ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఏబీఎం డిగ్రీ కాలేజీ మైదానంలో స్త్రీ, పురుష జట్ల ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. ఎంపిక కోచ్ టి.త్రినాథ్‌బాబు నేతృత్వంలో జరుగుతుందని, జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే 10వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో 26వ తేదీ ఉదయం 10 గంటలకు ఏబీఎం డిగ్రీ కాలేజీలో పీఎల్ రాజుకు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9949346536 లేదా 9398479248 లను సంప్రదించాలన్నారు.

పొగాకు చూర గరిష్టంగా రూ.155

● రెండు కేంద్రాల్లో చూర కొనుగోళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు చూర కొనుగోలు చేస్తున్నట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. పొదిలి, టంగుటూరు కేంద్రాల్లో మంగళవారం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రెండు కేంద్రాల్లో చూర వేలం పాటలో 1288 బేళ్లు రాగా, 1007 బేళ్లు కొనుగోలయ్యాయని, 281 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారని తెలిపారు. పొదిలి కేంద్రంలో 106వ రోజు వేలం పాటలో 722 బేళ్లు రాగా, 485 బేళ్లు కొనుగోలయ్యాయి. 237 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.137, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.68.73 పలికింది. టంగుటూరు వేలం కేంద్రంలో 112వ రోజు వేలం పాటలో 566 బేళ్లు రాగా, 522 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని, 44 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.155, కనిష్టంగా రూ.60 సరాసరి రూ.79.67 వచ్చిందని తెలిపారు.

కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నోట జిల్లా పేరు ప్రస్తావించారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేరుస్తున్నామని ప్రకటించారు. అయితే జిల్లాకు జరిగే మేలుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇదే మాదిరిగా రాష్ట్రంలో ఏడు జిల్లాలను ఈ జాబితాలో ఉంచినా ఏమీ ఉపయోగం లేదని, ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే గతంలో జిల్లాకు కేటాయించిన నిమ్జ్ ప్రస్తావనే లేదు. విశాఖ– చెన్నై పారిశ్రామిక కారిడార్ ప్రకటించినా ఏపీ పరిశ్రమలు వస్తాయన్న దానిపై స్పష్టత లేదని రాజకీయ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు.

● విత్త మంత్రి మాటలు.. ఒట్టి మూటలు!

ప్రత్యేక ప్యాకేజీతో ప్రకాశించేనా?



● వెనుకబడిన జిల్లాల ప్యాకేజీలో జిల్లా పేరు ప్రస్తావన
● నిమ్జ్, దొనకొండ ఇండస్ట్రియల్ హబ్‌లకు మొండిచేయి
● కేటాయింపులపై నోరు తెరవని వైనం
● ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్లో ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాల ప్యాకేజి లిస్టులో ప్రస్తావించి సరిపెట్టింది. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కేటాయింపులపై ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి జిల్లాను వెనకబడిన జిల్లాగా ప్రకటించాలని ప్రజలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అనేక పోరాటాలు జరిగాయి. జిల్లాకు న్యాయం చేయమని అడగడమే పాపం అన్నట్లు గత తెలుగుదేశం ప్రభుత్వం వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులను అరెస్టులు చేసింది. జైలులో పెట్టింది. అయితే ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వెనకబడిన జిల్లాగా ప్రకాశం జిల్లా పేరు ప్రస్తావించినప్పటికీ నిధుల గురించి మాట్లాడక పోవడంతో గతంలో దగా చేసినట్లు చేస్తారేమో అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇలాగే ఆంధ్రప్రదేశ్‌లోని 7 జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా గుర్తించింది. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాయలసీమలోని కర్నూలు కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించిన కేంద్రం అందుకు కేవలం రూ.350 కోట్లు మాత్రమే నిధులు మంజూరు చేసింది. అంటే ఒక్కో జిల్లాకు రూ.50 కోట్లు మాత్రమే విదిలించిందన్న మాట. సరే ఆ నిధులను కూడా ఖర్చు పెట్టకుండా తిరిగి వెనక్కి తీసుకుంది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఎదురుకాదన్న నమ్మకం ఏంటని పలువురు మేధావులు, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. బడ్జెట్ ప్రసంగంలో జిల్లా పేరు పలికినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదని, అమలులో జిల్లా అభివృద్ధికి సరిపడినంత నిధులు విడుదల చేసినప్పుడే కేంద్రం మాటలను నమ్మగలమని చెబుతున్నారు.


నిమ్జ్ సంగతేంటో...

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది నిమ్జ్ పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వం దీనికి ఒక బోర్డు పెట్టి చేతులు దులుపేసుకుంది. జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తుల కేంద్రంగా నామకరణం చేసి, కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, పీసీపల్లి, బోడవాడ, అయ్యన్న కోట తదితర 5 గ్రామాల్లో 14 వేల ఎకరాల భూమిని సేకరించేందుకు హంగామా చేసింది. కొంత భూమిని కూడా సేకరించింది. ఇక కనిగిరి ప్రాంతానికి కేంద్రం నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చి ఉత్పత్తులు ప్రారంభిస్తామని నమ్మబలికింది. వెనకబడిన కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. నిరుద్యోగ యువకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఒక్క నయాపైసా నిధులు విడుదల చేయకపోవడంతో ఆ తరువాత అక్కడ నిమ్జ్ అనే బోర్డు మాత్రమే దిష్టి బొమ్మలా మిగిలిపోయింది. పోనీ ఇప్పుడు కేంద్ర బడ్జెట్లో నిమ్జ్‌కు ఏమైనా నిధులు కేటాయిస్తారా అంటే అలాంటిదేమీ కనిపించలేదు. దాంతో పశ్చిమ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.



మాలకొండాపురం సమీపంలో నిమ్జ్ ప్రతిపాదిత ప్రాంతం (ఫైల్)

నైపుణ్య శిక్షణకు జగన్ రాచబాట..



యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాచబాట వేసింది. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి యువతకు శిక్షణ ఇచ్చింది. జిల్లా కేంద్రం ఒంగోలులో రెండు శిక్షణ కేంద్రాలతో పాటు, స్కిల్ కళాశాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా దాదాపు 25వేల మందికి శిక్షణ ఇచ్చింది. వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించింది. తాజా బడ్జెట్‌లో విద్య, నైపుణ్యాభివృద్ధి జాతీయ స్థాయిలో రూ.లక్షా 48 వేల కోట్లు కేటాయించడంతో జిల్లాలో మరింత మంది మేలు జరుగుతుందని యువత భావిస్తోంది.

దొనకొండకు ఒట్టిచేతులే...




విభజిత ఆంధ్రప్రదేశ్‌కు దొనకొండ రాజధాని కావాల్సి ఉంది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అమరావతిని ఎంపిక చేసింది. దానికి బదులుగా దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామంటూ హామీ ఇచ్చింది. నాటి హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా నేటికీ నెరవేరలేదు. ఇక్కడ వ్యవసాయానికి యోగ్యం కానీ 26 వేల ఎకరాల భూమి ఉంది. అనేక దేశ విదేశాల నుంచి పేరున్న కంపెనీలను తీసుకొచ్చి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం నమ్మించింది. ఆ ఐదేళ్ల కాలంలో కనీసం ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. మూడ్నెల్లకోసారి విదేశీ ప్రతినిధుల పేరిట ఎవర్నో ఒకరిని తీసుకొచ్చి వీధి నాటకాలను నడిపింది. అదిగో సింగపూర్ పరిశ్రమ అంటే ఇదిగో జపాన్ కంపెనీ అంటూ కాలయాపన చేసింది. ప్రభుత్వం మాటలను నమ్మిన రియల్ వ్యాపారులు వేల విలువ చేసే భూములను లక్షలకు కొనుగోలు చేశారు. తీరా చూస్తే కారిడార్ కాదు దొనకొండ ఒక కారడవిలా మారింది. కారిడార్ వస్తుందని లక్షలు వెచ్చించి భూములను కొన్న రియల్టర్లు జేబులు ఖాళీ చేసుకొని నెత్తిన గుడ్డేసుకున్నారు. తాజా కేంద్ర బడ్జెట్లో దొనకొండ కారిడార్ కోసం ఏమైనా నిధులు విడుదల చేస్తారేమో అనుకుంటే చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా మళ్లీ అమరావతి పేరుతో దగా చేస్తున్నారని ప్రజా సంఘాలు మండి పడుతున్నాయి. ప్రకాశం జిల్లాలో అటు పొదిలి నుంచి పామూరు వరకు, ఇటు దర్శి నుంచి కురిచేడు వరకు ప్రజలు నిత్యం పొట్ట చేతపట్టుకొని వలసలకు పోతుంటారు. ఈ వలసలను నివారించి స్థానికంగా ఉపాధి కల్పించేందుకు దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక నోడ్ అంటూ కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ఘనంగా ప్రకటించారు. అయితే ఏపీ పరిశ్రమలు వస్తాయి అన్న విషయాన్ని ప్రస్తావించలేదు.

ఆక్వా రైతులకు కొంత ఊరట..

రొయ్యల మేత ధరలను తగ్గించడం ద్వారా ఆక్వా రైతుకు కొంత ఊరట లభించిందనే చెప్పాలి. మేత ధరలు తగ్గించడంతో ఆక్వా రైతులకు మేలు జరుగుతుంది. జిల్లాలో సుమారు 16 వేల మంది ఆక్వా రైతులు దాదాపు రెండువేల హెక్టార్లలో ఆక్వా సాగు చేస్తున్నారు.

వెలిగొండకే రూ.2 వేల కోట్లు కావాలి...



ప్రకాశం జిల్లా అభివృద్ధికి జీవనాధారం లాంటి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఎంతో ముఖ్యమైంది. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే అంతకంటే ముందుగా నిర్వాసితులకు న్యాయం చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు ప్రారంభం నాటికి పిల్లలుగా ఉన్నవారు ఇప్పుడు పెరిగి పెద్దయ్ పెళ్లిళ్లు కూడా జరిగిపోయాయి. వారంతా ప్రాజెక్టు పరిధిలోనే నివశిస్తున్నారు. వీరందరికీ పునరావాసం కల్పించాలి. ఇప్పటి లెక్కల ప్రకారమే నిర్వాసితులకు న్యాయం చేయడానికి కనీసం రూ.2 వేల కోట్ల నిధుల అవసరం ఉంది. ఈ విషయంలో బడ్జెట్ నిరాశ నింపిందని చెప్పవచ్చు.

రూ.10 వేల కోట్లు కేటాయించాలి



ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించడాన్ని ఆహ్వానిస్తున్నాం. అయితే నిధుల విషయంలో స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అసంతృప్తిని, అపనమ్మకాన్ని కలిగించింది. గతంలో కూడా ఆంధ్ర ప్రదేశ్ లోని 7 జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా గుర్తించి అరకొర నిధులు ఇచ్చి తిరిగి తీసుకున్న చరిత్ర మోదీ ప్రభుత్వానికి ఉంది. ఇప్పుడైనా చేతికి డబ్బులు వచ్చేంత వరకు నిర్మలమ్మ మాటలను నమ్మేందుకు జిల్లా ప్రజలు సంసిద్ధంగా లేరు. ప్రత్యేక హోదా కోసం ఒత్తిడి చేయకుండా నామమాత్రపు నిధులతో సంతృప్తి చెందడం వలన రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనుకుంటే చంద్రబాబు తప్పులో కాలేసినట్లే. గతంలో జరిగినట్లే మోసం జరిగే అవకాశం ఉంది.

– కంకణాల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

ప్రత్యేక హోదా సాధించలేకపోవడం చంద్రబాబు వైఫల్యం



ప్రత్యే హోదా సాధించుకోలేకపోవడంలో చంద్రబాబు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. అమరావతి నిధులతో సంతృప్తి చెందడం మినహా తగినంత నిధులు కూడా తెచ్చుకోలేకపోయారు. వెనకబడిన జిల్లాగా ప్రకాశం జిల్లాను గుర్తిండం వలన మన జిల్లాకు ఒరిగేదేమీ లేదు. 2024–25 బడ్జెట్‌లో ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. వ్యవసాయాన్ని, ఉపాధి హామీని నిర్లక్ష్యం చేశారు. ఇది అన్నీ వర్గాల ప్రజలకు సంతృప్తి కలిగించే బడ్జెట్‌గా ఎన్డీఏ చెప్పుకోవడం సిగ్గుచేటు.

– చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యదర్శి

సామాన్య వేతన జీవులకు తీవ్ర నిరాశ



నూతన బడ్జెట్‌లో పాత ఆదాయ పన్ను స్లాబులు మార్చకపోవడం సామాన్యవేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించే అంశం. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని పాత పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్య తరగతి వర్గాలకు సామాన్య వేతన జీవులకు మేలు చేకూరేది. నూతన పన్ను విధానంలో రూ.7 లక్షల ఆదాయం వరకు ఉండే వారికి ఇచ్చే రిబేటును, పాత పన్ను విధానంలో ఉండే వారికి కూడా వర్తింపచేసి ఉండాల్సింది. సేవింగ్స్ పరిమితి కనీసం రూ.2.5 లక్షలకు పెంచి ఉంటే పొదుపు చేసుకోవటానికి ప్రోత్సాహం ఉండేది. రూ.8 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చి ఉంటే బాగుండేది. ప్రామాణిక తగ్గింపును రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పెంచడం కొంత మేర ఉపయోగకరం. అయినా, ప్రస్తుత జీవన వ్యయం బాగా పెరిగినందున రూ.లక్ష పెంచి ఉంటే బాగుండేది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగు పరచటానికి విభజన చట్టం ప్రకారం ప్రత్యేక హోదా ప్రకటించి ఉండాల్సింది. ఉద్యోగులంతా కోరుకునేలా సీపీఎస్ రద్దును ప్రకటించాల్సింది.

– టీ అశోక్ కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆశలు ఆహుతి

● విద్యుత్ తీగ తగిలి ముగ్గురు సజీవ దహనం
● ముగ్గురూ ప్రాణ స్నేహితులు
● నిరుపేద కుటుంబాల్లో తీరని రోదన
● కనిగిరిలో విషాద ఛాయలు



ఘటనా స్థలం వద్ద విలపిస్తున్న మృతుని బంధువులు



సొమ్మసిల్లి పడిపోయిన గౌతమ్ కుమార్ తల్లి

కనిగిరి రూరల్: విద్యుత్ తీగే వారి పాలిట మృత్యుపాశమైంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థుల సరదా వెరిసి మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతులు ముగ్గురు కనిగిరి పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబాల వారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాల్లో ఏకైక కుమారులు మృత్యు ఒడికి చేరడంతో వారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమై బోరున విలపిస్తున్నారు. మృతుల్లో ఒకరు కామినేని బాలాజీ (17)ది ఇందిరా కాలనీ కాగా, వీరమాసినేని గౌతమ్ కుమార్(19)ది కాశిరెడ్డి కాలనీ, ఎస్కే దేశబోయిన నజీర్(16) రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వాడు. వీరిలో నజీర్, గౌతమ్ కుమార్‌లు స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతుండగా, మరొకరు కే బాలాజీ చదువు మానేసి ఉన్నాడు. అయితే వీరు ముగ్గురు మంచి స్నేహితులు కావడంతో ఎక్కడకు వెళ్లినా కలిసి వెళ్తుంటారు. ఈక్రమంలో బుధవారం పునుగోడు చెరువుకు వెళ్లే దారిలో స్కూటర్‌పై వెళ్తుండగా విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతంలో మృత్యుఒడికి చేరారు. బాలాజీ తన అత్త సుభాషిణికి చెందిన స్కూటీని తీసుకుని వచ్చాడు. బాలాజీ టీవీఎస్ స్కూటీని నడుపుతుండగా, మధ్యలో గౌతమ్ కుమార్, చివర నజీర్ కూర్చుని ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. బాలాజీ తల్లి కే రాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే...

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే విద్యార్థుల ప్రాణాలు తీశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి వీస్తున్న ఈదురు గాలులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వైర్లు ఊగుతున్నాయి. అయితే పునుగోడు నుంచి వ్యవసాయ బోరు మోటార్లకు వెళ్లే ప్రధాన లైన్ రోడ్డు దాటి.. పొలంలో ఉన్న మరో విద్యుత్ పోల్‌కు బిగించే క్రమంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఘటనా తీరును పట్టి తెలుస్తోంది. ఈదురు గాలులకు పొలంలోని స్తంభానికి ఉన్న విద్యుత్ పింగాణి విరిగి కండక్టర్ జారి కింద పడింది. కొంత ఎత్తులో చిల్లచెట్లపై పడి వేలాడుతోంది. ఈ క్రమంలో అప్పుడే అటుగా స్కూటీపై వెళ్లిన ముగ్గురు విద్యార్థులు వైరు తగిలి షాక్‌కు గురై స్కూటీతో సహా కాలి మృత్యువాత పడ్డారు. విద్యుత్ అధికారులు ముందుగా ఫీల్డ్‌లోకి వచ్చి పరిశీలించి ఉన్నా.. లేదా కండక్టర్ వైరు బిగించే క్రమంలోనే పూర్తి నాణ్యతగా.. గట్టిగా బిగించి ఉన్నా.. విద్యార్థుల ప్రాణాలు పోయేవి కాదని స్థానికులు, మృతుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



మృత్యువులోను వీడని స్నేహం

ఒకే ఇంట్లో మూడు నెలల్లో ఇద్దరు పిల్లలు మృతి:

పట్టణంలోని కాశిరెడ్డి కాలనీకి చెందిన వీరమాసిన గౌతమ్ కుమార్‌ది రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం. తల్లి దండ్రులు గురవయ్య, కొండమ్మ ఇద్దరూ కూలి పనిచేసుకుంటూ పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. గౌతమ్ పెద్దకుమారుడు, రెండో అమ్మాయి సౌమ్య, మూడో అమ్మాయి సోని. ఈ క్రమంలో మూడు నెలల క్రితం సౌమ్య అనారోగ్యంతో మృతి చెందింది. మళ్లీ ఇప్పుడు విద్యుత్ ప్రమాదంలో పెద్ద కుమారుడు గౌతమ్ కుమార్ (18) మృతి చెందాడు. దీంతో ఆ తల్లిదండ్రులు చేసే రోదనలు చూపరులను కంట తడిపెట్టిస్తున్నాయి. ఉదయాన్నే తల్లి కొండమ్మకు కాలేజీకి వెళ్లి వస్తానని గౌతమ్ చెప్పి వెళ్లాడు..మధ్యాహ్నం కూడా కాలేజీలో భోజనం చేస్తున్నానని చెప్పాడని.. తర్వాత కొన్ని గంటలకే మృత్యు ఒడికి చేరాడంటూ తల్లి కొండమ్మ చేసే ఆర్తనాదాలు మిన్నంటాయి. ఒక్కడే కుమారుడైన గౌతమ్ మరణాన్ని జీర్ణించుకోలేక ఆ తల్లి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది.

శుభకార్యం జరగాల్సి ఇంట్లో..మృత్యు ఘోష

అది ఉమ్మడి కుటుంబం. అందరూ కష్టపడి జీవించే వాళ్లు. కామినేని కనకాద్రి, రాధల కుమారుడు కే బాలాజీ. పెద్ద అమ్మాయి సాయికి వివాహమైంది. రెండో అమ్మాయి నాగలక్ష్మికి పది రోజుల క్రితం నిశ్చితార్థం అయ్యింది. నెల రోజుల్లో పెళ్లి ముహూర్తం పెట్టుకున్నట్లు తెలిపారు. అక్క నిశ్చితార్థంలో బాలాజీనే అన్ని తానై చూసుకున్నాడు. తండ్రి, మామా ఇద్దరు బేల్దారి పనికి హైదరాబాద్ వెళ్లగా, నాయనమ్మ పిచ్చమ్మ, అమ్మ రాధ, అత్త సుభాషిణితో కలిసి రెండు కుటుంబాలు ఉంటాయి. మరి కొద్ది రోజుల్లో పెళ్లి బాజా మోగాల్సిన ఇంట్లో ఒక్క సారిగా చేతికి అంది వచ్చిన కుమారుడు బాలాజీ మృత్యుఒడికి చేరడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ తల్లి హృదయ విదారక రోదనలు మిన్నంటుతున్నాయి. ఇప్పుడే బయటదాక వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి బాలాజీ విగత జీవిగా మారడంతో అత్త సుభాషిణి బోరున విలపిస్తోంది.

చేతికంది వచ్చిన కొడుకు ఆహుతయ్యాడు..

ఇంటికి పెద్దకుమారుడైన ఎస్కే దేశబోయిన నజీర్‌ను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. చేతికి అందివచ్చిన కుమారుడు విద్యుత్ ప్రమాదంలో ఆహుతిగా మారడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. జేజి నాయన చెంచయ్య, తండ్రి వలి, తల్లి రసూల్‌బీలు కళాశాలలోని హాస్టల్‌లో వంట మాస్టర్లుగా పనిచేస్తారు. ఈక్రమంలో నజీర్‌కు జ్వరం రావడంతో కళాశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి తీసుకెళ్లి ఆస్పత్రిలో చూపించి ఇంట్లో వదిలారు. అయితే మధ్యాహ్నం తర్వాత కొన్ని గంటలకే మనవడు ఇంట్లో నుంచి వెళ్లి మృత్యువడికి చేరడంతో చెంచయ్య కన్నీటి పర్యంతమై విలపిస్తున్నాడు.

మంత్రి దిగ్భ్రాంతి:

విద్యుత్ షాక్ తగిలి ముగ్గురు యువకులు మృతి చెందడంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం అందిస్తామని ఒక ప్రకటనలో వెల్లడించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి: దద్దాల

పునుగోడు వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు యువకుల కుటుంబాలను ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తీవ్ర సానుభూతి తెలిపారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం లేదు.. ప్రమాదవ శాత్తు జరిగింది: డీఈఈ

విద్యుదాఘాతంతో ముగ్గురు విద్యార్థులు చనిపోయిన ఘటనలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ఏమీ లేదని డీఈఈ తెలిపారు. ప్రమాదవశాత్తు మాత్రమే కండక్టర్ వైరు తెగి ఘటన జరిగిందని వివరించారు. ఉదయం నుంచి వీస్తున్న ఈదురు గాలులకు వైరు రాపిడికి గురై 11 కేవీ వ్యవసాయ విద్యుత్ వైరు పునుగోడు లైన్ తెగిందన్నారు. అయితే నేలకు ఆనుకోకుండా చిల్లచెట్లపై ఉండటంతో పునుగోడు ఫీడర్ ట్రిప్ కాలేదన్నారు. అందువల్ల విద్యుత్ సరఫరా నిలవలేదన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు

● తాగునీటి కోసం విడుదల చేసిన సాగర్ జలాలు పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

సాక్షి ఎఫెక్ట్..



ఎస్ఏపీ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

దర్శి: ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా స్వచ్ఛమైన నీరు అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం 'సాక్షి'లో 'నిర్లక్ష్యంతో నీరు గారుస్తున్నారు' పేరుతో ప్రచురించిన కథనానికి కలెక్టర్ స్పందించి మంగళవారం ఎస్ఏపీ రిజర్వాయర్ కు నీరు తరలింపును పరిశీలించారు. డీబీసీ నుంచి ఎస్ఏపీ చెరువుకు నీరు సరఫరా చేసే పంప్ హౌస్‌ను పరిశీలించారు. సాగర్ కాలువలో వస్తున్న నీటి పరిమాణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరిగే నీటి పంపింగ్‌కు ఎన్నిరోజుల్లో చెరువు నిండుతుంది వంటి విషయాలు అధికారులతో చర్చించారు. ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించి రాపిడ్ శాండ్ ఫిల్టర్ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సాగర్ జలాలు నోటిఫైడ్ చెరువులు మాత్రమే నింపాలని సూచించారు. సాగర్ జలాలతో మంచినీటి రిజర్వాయర్ నింపడంలో అలసత్వం వహించవద్దని, అధికారులు నిత్యం పర్యవేక్షణలో ఉండి త్వరితగతిన రిజర్వాయర్ నింపాలని సూచించారు. సాగర్ జలాలు పక్కదారి పట్టకుండా అధికారులు నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం కురిచేడు మండలంలోని దర్శి బ్రాంచ్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌అలి, ఆర్డీఓ జాన్‌ఇర్విన్, తహశీల్దార్ సుజాత, కురిచేడు తహశీల్దార్ సుధాకర్, టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు.

దొనకొండ ఎయిర్‌పోర్ట్ భూముల పరిశీలన



కలెక్టర్‌కు భూములు చూపిస్తున్న ఆర్డీవో

దొనకొండ: దొనకొండలోని బ్రిటీష్ కాలం నాటి విమానాశ్రయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 14 సర్వే నంబర్‌లో 136.35 ఎకరాల్లో విమానాశ్రయాన్ని నిర్మించారు. అప్పుడు ఎయిర్ పోర్టు సైనికులు విశ్రాంతి తీసుకోవడానికి, ఇంధనం నింపుకోవడానికి ఉపయోగపడేది. నాటి నుంచి నేటి వరకు నిరుపయోగంగా చిల్లచెట్లతో నిండి ఉంది. విమానాశ్రయానికి ఎన్ని ఎకరాల భూమి అవసరమో, ప్రస్తుతం విమానాశ్రయం కింద ఎంత భూమి ఉంది, దానిలో ఏవైనా అన్యాక్రాంతం అయినట్లు ఉందా లేదా, ఇంకా ఎన్ని ఎకరాల్లో విమానాశ్రయాన్ని నిర్మిస్తారు. దానిలో ప్రభుత్వ భూమి అసైన్‌మెంట్ పట్టా భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి తదితర వివరాలను భూములకు సంబంధించిన మ్యాపుల ద్వారా కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్ కలెక్టర్‌కు చూపించారు. సమాచారాన్ని క్లుప్తంగా నివేదికను సిద్ధం చేసి అందజేయాలని కలెక్టర్ ఆర్డీఓను ఆదేశించారు. కలెక్టర్‌ను విలేకరులు ప్రశ్నించగా సాధారణ తనిఖీల్లో భాగంగా విమానాశ్రయాన్ని పరిశీలించినట్లు చెప్పారు. కలెక్టర్ వెంట దర్శి నియోజకవర్గం కూటమి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ వసంతరావునాయక్, డీఏఓఎస్ రాజేంద్రప్రసాద్, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకట్రావు, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు



పగులకొట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ, ఈఈ, డీఈలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి చోరీకి పాల్పడుతున్న దుండగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, దర్శి ఈఈ అబ్దుల్ కరీం తెలిపారు. తాళ్లూరు మండలం తురకపాలెంలో నాలుగు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడంతో స్పందించిన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం తాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసి విలేకరులు సమావేశంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తాళ్లూరు, ముండ్లమూరు, అద్దంకి, బల్లికురువ, జె.పంగులూరు మండలాల్లోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో ట్రాన్స్‌కో చీఫ్ విజిలెన్స్ అధికారి లావణ్య లక్ష్మి ఆదేశాల మేరకు ఒంగోలు ఎస్ఈ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పాత నేరస్తులపై నిఘా ఉంచినట్లు చెప్పారు. పాత విద్యుత్ వస్తువుల కొనుగోలు చేసే వారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల పరిసరాల్లో ఎవరైనా పరిచయం లేని వ్యక్తులు సంచరిస్తుంటే తక్షణమే స్థానిక పోలీసులు, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యుత్ ఏడీ కె.పిచ్చయ్య, ఏఈ వీరబ్రహ్మం, ఎస్సై విజయకుమార్, ఏఎస్సై మోహనరావు, ఎల్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఒంగోలు టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు భారీ స్పందన కనిపించింది. మినీ జాబ్‌మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 387 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం 58 మంది ఎంపికైనట్లు జిలా ఉపాధి కల్పనా అధికారి టి.భరద్వాజ్ ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులకు భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజివ్ లిమిటెడ్ (ఇండస్ బ్యాంక్), రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, బ్యాంకింగ్ లోన్ ఆఫీసర్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలలో నియమించినట్లు తెలిపారు. వారికి నెలకు రూ.14,500 నుంచి రూ.21 వేల వరకు వేతనం, పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి రవితేజ యాదవ్, స్టేప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారులు ఎస్. ఇందిరా దేవి, టీజే రాజారావు, యంగ్ ప్రొఫెషనల్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు తరలివచ్చిన అభ్యర్థులు

శాంతి భద్రతల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- రాజకీయ పార్టీలకు కొమ్ముకాయొద్దు
- ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు నివారించాలి
- పోలీస్ సిబ్బందికి ఎస్పీ ఏఆర్ దామోదర్



టంగుటూరు పోలీసు స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

సింగరాయకొండ/టంగుటూరు: శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌తోపాటు టంగుటూరు స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాల్లో కలియతిరిగి మౌలిక వసతులపై ఆరా తీశారు. గతంలో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన «మున్నా» కేసును ఛేదించడంలో తనతో కలిసి పనిచేసిన ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, షేక్ మహబూబ్ బేగ్‌తో ముచ్చటించారు. పోలీసు సిబ్బందిని పరిచయం చేసుకుని వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సూచించారు.



సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లో వసతులను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

రాజకీయ పార్టీలకు అతీతంగా నడుచుకోవాలే తప్ప ఒక పార్టీకి కొమ్ముకాయవద్దని హెచ్చరించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకసారి శ్రమదానం నిర్వహించాలని చెప్పారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని, జవాబుదారీగా ఉండాలని, మహిళలు, పిల్లలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్, సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్ ఉన్నారు.



ఢిల్లీకి బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ఢిల్లీ ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం/కొనకనమిట్ల: రాష్ట్రంలో పెచ్చరిల్లుతున్న హింసాకాండ, టీడీపీ కూటమి నేతల భౌతిక దాడులను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన ధర్నాకు మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు తరలివెళ్లారు. మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మోరా శంకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఏలూరి సంజీవరెడ్డి, మందలపు శ్రీనివాసరెడ్డి, ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పాతకోట వెంకటరెడ్డిచ పార్లపల్లి సిద్ధానబీ, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్ తదితరులు ఢిల్లీ వెళ్లిన వారిలో ఉన్నారు. ముఖ్యంత్రి చంద్రబాబునాయుడు ఆటవిక పాలనను నిరసిస్తూ, రాష్ట్రంలో హింసాకాండ, హత్యలు, అత్యాచారాలను ప్రధాని, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు దేశ ప్రజలకు వివరించేందుకు ఢిల్లీలో ధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు పాలనలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు పెరిగిపోయాయని విమర్శించారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దద్దాల, వైఎం ప్రసాద్‌రెడ్డి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దద్దాల

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ఢిల్లీలో కలిశారు. ఈయన వెంట పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

10 మంది వీఓఏల తొలగింపు



తర్లుపాడు వెలుగు కార్యాలయం

తర్లుపాడు: ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయికి చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న వీఓఏలకు రాజకీయ కారణాలతో ఉద్వాసన పలికారు. తర్లుపాడు మండలంలోని సూరేపల్లి, సీతానాగులవరం, తాడివారిపల్లి, రోలుగుంపాడు, గానుగపెంట, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి, కలుజువ్వలపాడు గ్రామాలకు చెందిన వీఓఏలకు అకారణంగా తొలగించారు. అనేక సంవత్సరాలుగా డ్వాక్రా మహిళలకు సేవలు అందిస్తున్న తమను తొలగిస్తున్నారన్న విషయం తెలియడంతో వీఓఏలు మొత్తం ఆందోళనకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం వ్యవహరించకుండా అకారణంగా తొలగిస్తుండటంపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి.

ఖైదీలు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి



జైలు సిబ్బందితో సీపీఆర్ చేయిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: అత్యవసర సమయాల్లో సాటి మనిషిని ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు ఖైదీలు సీపీఆర్ గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి. వరుణారెడ్డి అన్నారు. జిల్లా జైలులో చైతన్య కార్డియో సెంటర్, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో మంగళవారం గుండె, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, సిగరెట్లు, ఇతరా చెడు అలవాట్లకు దూరంగా ఉండడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. అనంతరం కార్డియాలజిస్టు డాక్టర్ ఎస్ శివ కృష్ణ సీపీఆర్ విధానం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఖైదీలకు వైద్య పరీక్షలు చేసి సూచనలు చేశారు. జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మతేజ, జైలర్ వి. రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ టీఏ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజ్‌కుమార్


మార్కాపురం రూరల్: మండల కేంద్రమైన పుల్లలచెరువు ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జమ్ములమూడి రాజ్‌కుమార్ మంగళవారం ఉదయం ఆత్మహత్యకు యత్నించాడు. మార్కాపురం మండలంలోని గజ్జలకొండలో తన నివాసంలో భోజనంలో పురుగు మందు కలిపి తిని ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. చికిత్స నిమిత్తం మార్కాపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఆయన చికిత్స పొందుతున్నాడు. బాధితుడు రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ ఉన్నతాధికారులు రాజ్‌కుమార్‌తోపాటు మరో నలుగురు టీఏలను వివిధ కారణాలతో సస్పెండ్ చేశారు. విచారణాధికారి అయిన ఏపీడీ నిర్మల హాజరుకాకుండా ఎంపీడీఓ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న నక్కా నాగేశ్వరరావును విచారణకు పంపారు. సస్పెన్షన్‌కు గురైన నలుగురి వద్ద లంచం తీసుకున్న నాగేశ్వరరావు వారికి అనుకూలంగా నివేదిక ఇచ్చి, తాను డబ్బు ఇవ్వకపోవడంతో వ్యతిరేకంగా రిపోర్టు రాసి మానసికంగా వేధిస్తున్నాడని రాజ్‌కుమార్ ఆరోపించారు. ఈ సంఘటన ఉపాధి హామీ వర్గాల్లో సంచలనం సృష్టించింది.

నేరగాళ్లూ జాగ్రత్త


- మహిళలు, యువతులపై వేధింపులకు పాల్పడితే జైలే..
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే ఐటీ యాక్ట్
- ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక

ఒంగోలు టౌన్: ఎవరైనా సరే చట్ట వ్యతిరేక, అసాంఘిక, అనైతిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లాలో నేరాలకు పాల్పడుతున్న వారికి ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టడం, వదంతులు, దుష్ప్రచారాలను పోస్ట్ చేస్తే ఐటీ యాక్ట్ ప్రకారం శిక్షలు తప్పవన్నారు. ఫలానా వారి తాలూకా అంటూ నంబర్ ప్లేట్లు పెట్టుకొని వాహనాలపై దర్జాగా తిరుగుతున్న వారిని వదిలిపెట్టేది లేదన్నారు. ఎంవీ యాక్ట్ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మోడిఫైడ్ సైలెన్సర్లతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం తాగి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని చెప్పారు. మెడికల్ షాపులు నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. గంజాయి వ్యాపారంతో సంబంధాలు ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే 9121102266కు తెలియజేయాలని కోరారు.

రైల్లో ఒకరు...రైల్లోంచి జారిపడి మరొకరు మృతి



రైల్లో మరణించిన వ్యక్తి మృతదేహం



రైల్లోంచి జారిపడి మరణించిన వ్యక్తి మృతదేహం

ఒంగోలు టౌన్: విధి చిత్రం అంటే ఇదేనేమో. ఒకరు అనారోగ్యంతో ఒంటరిగా ప్రయాణం చేస్తూ మార్గమధ్యంలో మృత్యుఒడికి చేరుకున్నారు. మరొకరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి పొరపాటుగా జారిపడి దుర్మరణం పాలయ్యారు. పోలీసులు కథనం ప్రకారం... మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ఒంగోలు రైల్వేస్టేషన్లో దించి జీజీహెచ్‌కు తరలించారు. సింగరాయకొండ , టంగుటూరు మధ్యలో మాగుంటపాడు సమీపంలో పాలేరు రైల్వే బ్రిడ్జి దగ్గర గుర్తు తెలియని యువకుడు రైల్లోంచి జారిపడి మరణించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.